[ కథానిక ]

# గుడ్డిదైవం

'అమరేంద్ర'

"బాగా ఆలోచించావా, కరుణా? ఇది ఒక నాటితో తీరిపోయేది కాదు. ఇది ఒక నిమిషంలో తేల్చి చెప్పే విషయం కాదు"

"బాగా ఆలోచించే చెబుతున్నాను. ఈ విషయంలో మీరు అనవసరంగా దిగులుపడకండి. నామాట నమ్మండి."

"నమ్మకేం? నీ మాటమీద నాకేం అపనమ్మకం? కాని బాగా ఆలోచించే ఈ మాట అన్నావా అని మళ్లీ అడుగుతున్నాను."

"నాకు మీలాగా అయినదానికీ కానిదానికీ ఆలోచనల్తో తల బద్దలుకొట్టుకోటం చేతకాదు. అయినా ఇందులో అంత ఆలోచించవలసిన విషయం నాకేమీ కనబడటంలేదు" అని కరుణ బదులుచెప్పేసరికి భర్త శాస్త్రి అంతటితో తృప్తిపడి వూరుకున్నాడు. ఆ విషయాన్ని ఇంకా పట్టి పల్లార్చటం అనవసర మనిపించింది.

కళ్ళు మూసినా తెరిచినా కరుణకి మరిది ముఖమే కనిపిస్తుంది. జాలిగొలిపే ఆ దీనమైన ముఖాన్ని చూసి ఆమె గుండె జలదరించిపోతుంది. నిజానికి ఆలోచించవలసిందేమీ లేదనిపిస్తుంది. ఎంత తరిచిచూసినా అది తనకర్తవ్యమేమో ననిపిస్తుంది. ఆ భారం దైవమే తనమీద పడేసినట్లూ, అది తను ఎల్లాగైనా సరే నెరవేర్చితీరాల్సినట్లూ కరుణకి తోచింది.

కాని శాస్త్రికిమాత్రం లోపల ఎందుకో బెదురుగా వుంది. ఈ భారాన్ని తమరిద్దరూ మొయ్యగలుగుతారో లేదో? కరుణ చెప్పినమాటలు ముఖప్రీతికి అన్నవి కావని శాస్త్రికి బాగా తెలుసు. కాని కరుణ ఈ మాట మీదనే నిలబడగలుగుతుందా అని భయం.

మర్నాడు తెలతెలవారుతుండగా వాళ్లిద్దరూ బయలుదేరారు. బండీవచ్చి వాకిట్లో నిలబడింది. కదలబోయే బండీదగ్గరికి మామగారు వచ్చి కళ్లుతుడుచుకుంటూ నిలబడ్డారు. ఎంతకీ మాట పెగిలిరావటంలేదు. చివరికి ప్రయత్నంమీద "మీరే వాడికి తల్లీ తండ్రీ—" అని ఇక మాట్లాడలేక ఆగిపోయారు. "వెళ్లొస్తాం, నాన్నా. నువ్వేమీ దిగులుపెట్టుకోకు" అని శాస్త్రి బండీ ఎక్కాడు. ఇంతసేపూ మెదలకుండా వున్న కరుణ ధైర్యంచేసి "మీరేమీ దిగులుపెట్టుకోవద్దు; వెళ్లొస్తాం." అంది. కరుణమాటల్లో అభయమిస్తున్న ధ్వని స్ఫుటంగా వినిపించింది. కోడలిమాటలువింటుంటే మామగారి దుఃఖమంతా గాలికి తేలిపోయే వాన మబ్బులాగా చెదిరిపోయింది. విషాదచ్ఛాయలతో అలుముకున్న ఆయనముఖంలో సంతృప్తి ఒక్క క్షణంసేపు మెరిసిపోయింది.

చూస్తుండగానే బండీ కనుచూపుమేర దాటి దూరపు మామిడితోపుల్లో కలిసిపోయింది. శాస్త్రి తండ్రిశరీరం అక్కడ నిలబడిందన్నమాటే కాని హృదయంమాత్రం ఆ బండీతోనే సాగిపోతోంది. మళ్లీ ఎన్నాళ్లకి చూస్తానో అన్న ఆరాటం. ఇక ముందురోజులు ఏవిధంగా గడుస్తయ్యో అన్న భయం. గుండెల్లో పొంగిపొర్లే దుఃఖం. దూరాన కొండలచాటునించి పరువిడివస్తున్న ఉషస్సు. ఆ అరుణకాంతులలో ఆర్తినంతటినీ మరిపించగల శాంతి. "అవును, నా చేతుల్లో ఏముంది? నేను ఊరికే చూస్తూ నిలబడవలసినవాడినే. నిజం. ఇదంతా నాటకంలాగా నడిచిపోవలసిందే. నేనుమాత్రం చూస్తూ నిలబడటం తప్ప చెయ్యగలిగిందేమీ లేదు" అనుకున్నాడు. ఈ అసహాయతలోనే

ఏదో ఓదార్పు కనిపించింది. ఈ చేతకానితనంలోనే ఆయన కేదో మనశ్శాంతి కనిపించింది.

"బాబుగారూ! ఒక్కరూ అరుగుమీద కూచున్నారేం?" అని తంబూరా మీటుతూ ముష్టికి వచ్చిన ముసలిబైరాగి పలకరించాడు.

"అంతా వెళ్లిపోయారు నాయనా." అని బదులుచెప్పి కళ్లు తుడుచుకుంటూ అరుగుమీదే చతికిల బడిపోయాడు.

౨

"చూశారా, మన మధువి పాముచెవులండోయ్! చీమ చిటుక్కుమంటే చాలు గిర్రున ఆవేపుకి తిరిగేస్తాడు."

"అవునవును. వాడి నాలుకకూడా బలే పలచన. మనం ఏ ధ్వనిచేస్తే తనూ ఆ ధ్వని చేస్తాడు."

"నిజమే. పిల్లడికి మంచిగుర్తుకూడా వుంది. చెప్పులచప్పుడు అవగానే 'అన్న'అంటూ కాళ్లూ చేతులూ ఎగరేస్తాడు. నేను ఇంట్లో ఏమూలవున్నా సరే గాజుల చప్పుడు విని "ఒదిన...ఒదిన" అంటాడు."

"అడుగో మన మాటల సందడికి అప్పుడే నిద్ర లేచాడు"అని శాస్త్రి ఉయ్యాలలోంచి మధుసూదనుని ఎత్తుకునివచ్చాడు. మధు తన చిన్నిచేతుల్తో అన్నగారి ముఖాన్నీ,ముక్కునీ తడువుతున్నాడు. జాలివేసి ముద్దు పెట్టుకుని "మధూ! ఇది ఎవర్రా?"అని అడిగాడు. కిలకిల నవ్వుతూ సొట్టలుపడ్డ బుగ్గలతో ముద్దుగా "ఒొదిన" అనేసరికి కరుణ మరిదిని తన చేతుల్లోకి తీసుకుంది. ఉంగరాలు తిరిగిన జుట్టుని చేత్తో సవరించి ధగధగమెరిసే మధుముఖంకేసి చూడగానే కరుణ కళ్లలో నీళ్లు గిర్రున తిరిగినయ్. ఇది చూసి "దేనికి కరుణా" అన్నాడు శాస్త్రి. "ఏమీలేదు. దేవుడు ఇంత చిన్నచూపు ఎందుకు చూశాడా అని నా విచారం"అని కరుణ కళ్లు తుడుచుకుంది. "అదే నాకూ బాధగా వుంటుంది. ఇంత అందమైన ముఖాన్ని చేసిన వాడు ఆ కళ్లు రెండూ ఎందుకు దయచేయలేదూ? ఎందుకింత కనికరం లేకపోవాలి?" అన్నాడు శాస్త్రి.

కరుణచేతుల్లో కేరింతలు కొడుతున్న మధుకి అన్నకీ వొదినకీ మధ్య నడుస్తున్న మాటలు అర్థం కాలేదు. అందుకే తన చేతుల్తో తారంగాలు వాయిస్తూ "లాంలాం"అని దీర్ఘాలు సాగించాడు. తను ఏదో పెద్ద పాటకచేరీ చేస్తున్నంత తన్మయం కలుగుతుంది మధుకి. ఇది విని పట్టలేని సంబరంతో కరుణ "చూడండీ! మన మధుకంఠం గంధర్వులకైనా వుంటుందా? మా బాబువికదూ, పాడు, మీ అన్నయ్యకి వినిపించు" అనగానే మధు మరీ పారవశ్యంతో "లాంలాం సీతాలాం" అన్నాడు. వినగానే శాస్త్రికి తన తమ్ముడొక గొప్ప సంగీతపాటకుడైపోతాడనే నమ్మకం కలిగింది. "దైవం చల్లటి చూపు చూస్తే మనవాడు మంచి గాయకుడవుతాడు కరుణా" అన్నాడు శాస్త్రి.

"తప్పకుండాను. మధుకి ఇంత అన్యాయంచేసిన దేవుడు ఆపాటి మేలు చేయకపోతాడా?"అంది కరుణ.

మధుదురదృష్టం కళ్లు లేకపోవటమేకాదు. పుట్టగానే తల్లి చనిపోయింది. శాస్త్రిని కన్నతర వాత ఇరవైరెండేళ్లకి ఆమెకి మళ్లీ కానుపు వచ్చింది. కళ్లులేని మధుని భూమిమీద పడేసి ఆవిడ కళ్లుమూసుకుంది. అప్పటినించీ మధుని సాకే భారమంతా కరుణమీదనే పడింది. కాపురానికి వచ్చి సరదాగా ఏడాది అయినా గడవకుండానే గుడ్డిమరిది భారం అంతా కరుణమీదనే పడింది.

౩

పడుకోబోయేముందు మధు పక్కమీద కూచుని "రఘుపతిరాఘవ రాజారాం" అని కంఠం ఎత్తాడు. ఏదో చదువుకుంటున్న శాస్త్రి పుస్తకం మూసేసివచ్చి తమ్ముడి పక్కమీద కూచున్నాడు. అన్నగారి అలికిడి విని మధు పాట ఆపేశాడు. "తప్పు మధూ! నన్ను చూసి బెదురుతావెందుకూ? పాడు. భయందేనికి? నేనూ వింటాను" అని గడ్డం పుచ్చుకుని బతిమాలాడు. కాని మధు సిగ్గుతో వంచిన తలఎత్తలేదు, పెదవి కదపలేదు. ఇంతలో వంటింట్లోంచి కరుణవచ్చి "మా బంగారు తండ్రివికదూ, పాడవూ?" అంది మధుతల నిమురుతూ.

వదినగారి ఆసరా చూసుకుని "పతితపావన సీతారాం" అని చరణం అందుకున్నాడు.

వింటుంటే శాస్త్రికళ్లు తడిసిపోయినయ్. తమ్ముడికంఠంలో ఏదో తెలియని జాలివుంది. వినేవాళ్ల గుండెల్ని బద్దలుకొట్టే వింత శక్తి వుంది. ఒక్క చరణం విన్నా బాధతో కళ్లు తడిసిపోయినయ్. కాని ఈ బాధని మరిపించే మాధుర్యంకూడా అతనికంఠంలో వుంది.

మధు పాట ఆపివేశాక కళ్ళు తుడుచుకుంటూ కరుణ అక్కడినుంచి వెళ్లిపోయింది. శాస్త్రి అక్కడే కూచుండిపోయాడు. తనుకూడా దుఃఖపడి ఏం లాభం? దుఃఖంతో బేజారెత్తికూచుంటే తనకి కలిసివచ్చే దేముంది? కాని ఏమిటి చెయ్యటం? తన బాధ్యత ఎల్లా నెరవేర్చటం? తన గుడ్డితమ్ముడి జీవితాన్ని ఎల్లా తీర్చి దిద్దటం? ఏమీ పాలుపోవటంలేదు. ఏమైనప్పటికీ తమ్ముడిభారమంతా తనే వహించాలి. తమ్ముణ్ణి గురించి ముసలివయస్సులోవున్న తండ్రిమనస్సుని కష్ట పడనీయకూడదు. మధునిగురించి విచారం వదలివెయ్య మని తండ్రికి మాట ఇచ్చాడు. ఆ మాట నిలుపుకోవల సిందే. కళ్లులేని కొరతలేకుండా తమ్ముడికికూడా ఏదో ఒక బతుకుతెరువు కల్పించాలి. కాని అది తనబోటి వాడికి ఎల్లా వీలవుతుంది? తనకి వచ్చే కాస్తజీతంతో కుటుంబం వెళ్ళదీయటమే కష్టంగా వుంది. అటువంటి తను తమ్ముడికి ఏం సదుపాయాలు కల్పించగలడు? ఆలోచిస్తే అంతా అగాధంగా కనిపిస్తున్నది.

మధు నిద్రపోయాడు. మీద పంచ కప్పి శాస్త్రి లేచివెళ్లాడు.

"కరుణా, మధుని బళ్లోవేద్దామా?" అన్నాడు.

"తప్పకుండానూ"

"కాని అది మన తాహతుకి మించిన బరువవు తుందేమోనని సంకోచిస్తున్నాను"

"అయినాసరే. తప్పదు. దేవుడు ఎల్లాగో అన్యాయంచేశాడు. మనం కూడా ఏమీ చెయ్యకుండా వూరుకుంటే ఎల్లాగు చెప్పండీ?"

"అయితే ఏం చెయ్యమంటావ్ కరుణా?"

"మనం ఒకపూట పస్తుపడుకునిఅయినాసరే మధుని బళ్లో చేర్పించవలిసిందే. చదువుతోపాటు సంగీతంకూడా నేర్పించాలిసిందే."

"అయితే రేపు చేర్పించమంటావా?"

"ఇంకా ఆలస్యం దేనికి? సంగీతమే వస్తే మధుకి చాలిన గాయకులే వుండరనిపిస్తుంది. మధు కంఠం ఎత్తితే చాలు ఎందుకో వొళ్లు జలదరిస్తుంది."

"అవును కరుణా, మధు ఏదిపాడినా ఎంతో దీనంగా గుండె కరిగేట్లుగా వుంటుంది. తన కింత అన్యాయంచేసిన దేవుడికి ఏదో దీనంగా విన్నవించు కుంటున్నట్లుంటుంది. అయితే రేపే చేర్పిస్తాను."

౪

అది గుడ్డివాళ్లకీ, మూగవాళ్లకీ, చెవిటివాళ్లకీ చదువుచెప్పేబడి. మధు ఒక పెద్దపుస్తకం ముందువేసు కుని చూపుడువేలుతో తడువుకుంటూ కళ్లున్న పిల్లడి లాగా అక్షరాలూ, పేర్లూ చదువుతున్నాడు. తడువు కుంటూ అక్కడికివచ్చిన ఇంకోపిల్ల కాస్సేపు నిల బడి, ఆ కంఠం విని చిరునవ్వుతో "ఏయ్, నీ పే రేమిటీ?"అని పలకరించింది.

"నా పేరా? మధుసూదన్."

"అంత పెద్ద పేరా? మధూ అంటే బాగుం డదూ? ఏం? ఒప్పుకుంటావా? కోపం వస్తుందా?"

"కోపం దేనికీ? అంతా నన్ను మధూ అనే పిలుస్తారు."

"అయితే నేనూ అల్లాగే పిలుస్తానేం, మధూ."

"సరే. అయితే, నీ పేరేమిటో చెప్పవా?"

"నువ్వు అడగకుండా ఎందుకు చెబుతా నేమిటీ?"

"అడుగుతున్నానుగా. ఇక చెప్పు మరి."

"చెప్తాను. సుధ."

"మీ దేవూరు సుధా?"

"నాకు తెలియదు."

"మీ అమ్మా, నాన్నా ఎక్కడున్నారు?"

"నాకు తెలియదు."

"అయితే నువ్వెప్పుడూ ఇక్కడే వుంటావా?"

"అవును."

ఇంతలో "ఒరేయ్, ఏంచేస్తున్నావురా? దొంగల్లాగా ఈ మూలనక్కి ఎక్కడకన్నంవేద్దామని కుట్ర చేస్తున్నారా?"అని బిగ్గరగా అరుస్తూ గోపాలం వచ్చాడు. "ఎక్కడా? నీ చెవులో"అని సుధ ఫక్కున నవ్వింది. "ఎందుకమ్మా అల్లా ఇకిలిస్తావ్? నీ పళ్లు బాగానే వున్నయ్‌లే, బియ్యపుగింజల్లాగా" అని గోపాలం అరిచాడు. మధు నవ్వుతూ గోపాలం చెయ్యిపుచ్చుకునిలాగికూచోబెట్టాడు. "చెవిటిగోపాలం చెవులో కన్నంవేస్తాం"అని సుధ తన చేతులో వున్న పలకమీద పెద్దఅక్షరాలతోరాసి ఎత్తిచూపించింది. గోపాలం మండిపడిపోయి "నేను చెవిటివాణ్ణయితే నువ్వు గుడ్డికొక్కిరాయివి కావా? మహాలావు నీకే వొచ్చిందిలే రాయటం?" అని సుధచేతులోంచి పలక గుంజుకోబోయాడు. మధు అడ్డంవచ్చి "ఎందుకురా అంతకోపం? నిన్నేం తప్పుమాట అనలేదుగా" అని బిగ్గరగా అన్నాడు. గోపాలం మరింత ఉగ్రుడైపోయి "ఏడిసినట్లే వుంది నువ్వు చెప్పేది. నాకు చెవుడని ఎవరు చెప్పారూ? ఇందాకటినించీ మీరు ఆడుతున్న కబుర్లన్నీ వినటం లేదనుకున్నారా?"అని గట్టిగా అన్నాడు. గట్టిగా మాట్లాడితేకాని ఇతరులకూ్కడా వినపడదేమోనని గోపాలం ఎప్పుడూ అరిచినట్లే మాట్లాడుతాడు. వాడి మాటలకి సుధా, మధూ పగలబడి నవ్వేసరికి వాడి కోపం శృతిమించిపోయి "మాడండి, మేష్టారుతో చెప్పి మీ పని పట్టిస్తాను కాసుకోండి"అని బెదిరిస్తూ పెద్దపెద్ద అంగలేసుకుంటూ వెళ్లిపోయాడు.

"మధూ, నిన్నటికృతి వచ్చిందా" అంటూ సంగీతం మేష్టారు వచ్చాడు. ఆయనా గుడ్డివాడే. ఆరోయేట మశూచికంవచ్చి కళ్లు పోయినయ్. అప్పట్నుంచీ ఈ బళ్లోనే చదివి ఇప్పుడిక్కడే వుద్యోగం చేస్తున్నాడు. ఆయన ఫిడేలు వాయిస్తాడు. వీణ వాయిస్తాడు. డైపు కొట్టగలడు. సైకిలుకూడా బడి ఆవరణలో తొక్కగలడు. బళ్లో మధు చేరినదగ్గరనించీ అతనిమీద ఆయనకి ప్రత్యేకమైన శ్రద్ధా, అభిమానమూ.

ఆయన పిలవగానే మధువచ్చి పాట మొదలుపెట్టాడు. తన ఫిడేలు తెచ్చుకుని సుధ ఆ కృతిని వాయిస్తూకూచుంది. పాట అయిపోగానే మాష్టరు మధుతలని చేత్తో నిమిరి "మధూ! ఇంత మంచికంఠం వుండటం ఎంత అదృష్టం!"అని వెళ్లిపోయాడు.

ఈ మాటలు వినేసరికి సుధ మనస్సు ఒక్కగంతేసింది. మాష్టరు తనని పొగడినా తనకి అంత సంతోషం కలిగేదికాదు. కాని చిలిపిగా పైకిమాత్రం "అబ్బాయి ఉబ్బిపోతున్నాడు-నన్నేకదా మాష్టారు పొగడారని". అంటూ ఎత్తిపొడిచింది. "పోనీలే, పాపం విచారపడకు. నీ వాయిద్యాన్ని నేను పొగడతానులే" అని నవ్వుతూ అన్నాడు మధు.

గోపాలం గర్వంగా పరిగెత్తుకుంటూ వొచ్చి "రండి. పందెం. మీ ఇద్దర్లో ఎవరైనాసరే. ఇల్లాంటి బొమ్మ వెయ్యండి, పస తెలుస్తుంది"అంటూ తను వేసిన బొమ్మని చూడలేకపోయినందుకు సుధనీ, మధునీ హేళనచేశాడు.

"అవును మహాలావు నీకొక్కడికే వొచ్చునులే కుక్కబొమ్మలూ కాకిబొమ్మలూ గీయటం"అంది సుధ.

"కాకపోతే, నీలాగా పొడుగాటి బెత్తంపెట్టి తీగెలమీద బరకటం అనుకున్నావా? వీడిలాగా నోట్లో పళ్లన్నీ కనబడేట్లు గొంతు చించుకోటం అనుకున్నావా? ఈసారి చెవిటి గోపాలం అనండి చెబుతాను మీ పని" అంటూ గోపాలం వెళ్లిపోయాడు.

౨

"ఊరుకో తండ్రీ. మా బాబువిగా. ఇదుగో మీనాన్న వొచ్చేవేళయింది. ఏడవకు తండ్రీ, పాలడబ్బా తెస్తారు"అంటూ కరుణ కొడుకుని ఎత్తుకు తిప్పుతూ సముదాయించింది. ఈ సంజాయిషీతో తృప్తిపడక పూచికపుల్లలాటి కాళ్లూ చేతులూ ఆడిస్తూ గుక్కపట్టి ఏడవటం మొదలుపెట్టాడు. పగిలిపోవటానికి సిద్ధంగావున్న బెలూన్‌లాగా వుంది కుర్రాడి లివర్‌జబ్బుపొట్ట. కాళ్లా చేతులా నిలవకుండా ఏడుస్తున్నాడు. దూలానికి వేలాడుతున్న గుడ్డవుయ్యాలలో పడుకోబెట్టి ఎంతోసేపు వూపింది. సొమ్మసిల్లి కుర్రాడు నిద్రపోయాడు.

తరవాత ఎంతోసేపటికి శాస్త్రిఇంటికివచ్చాడు. కరుణకి ముఖంచూపించలేకపోయాడు. ఉత్తచేతుల్తోనే

ఇంటికి తిరిగివచ్చాడు. గూట్లో గుడ్డిదీపం గుప్పు గుప్పుమంటోంది అవసాన దశలోని ప్రాణంలాగా. ఉయ్యాల వూపుతున్న కరుణ భర్తముఖంకేసి చూసింది. సంగతులన్నీ చెప్పకుండానే తెలిసినయ్. సహించలేని ఆవేదనతో ఆమెగుండె మండిపోతోంది. ఎంత ఆపుకున్నా ఆగకుండా ఉప్పెనలాగా ఆక్రోశం వస్తోంది. ఈ బాధలవల్ల కరుణకి భర్త మీద ఎందుకో తెలియనికోపం. అతను తనకీ, తన బిడ్డకీ ఏదో ఘోరమైన అన్యాయం చేస్తున్నట్లు అనిపిస్తుంది. తమ కేదో అపచారం చేసినట్లు అతనిమీద అక్కసు పట్టలేక విసురుగా అంది కరుణ "ఇప్పుడేం చెయ్యమంటారు ?"అని.

శాస్త్రి తడబడుతూ "ఏంచెయ్యను? నెలాఖరు. ఎక్కడా అప్పుదొరకలేదు. అందరినీ అడిగి లేదనిపించుకున్నాను."అని దీనంగా అన్నాడు.

కరుణ "పిల్లాడు గాలిఆకలితో మెలికెలు తిరిగిపోయి ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి పడుకున్నాడు. వాడు నా ప్రాణానికి వుసూరుమంటున్నాడు. ఎందుకొచ్చిన సంతానం ? పుట్టగానే పోయినా పీడ విరగడైపోయేది" అని పరుషంగా అంది.

"అదేమిటి కరుణా ? అల్లా మాట్లాడతావేం?" అన్నాడు శాస్త్రి భార్యధోరణికి ఆశ్చర్యపడుతూ.

"ఏం తప్పు మాట్లాడాను? పిల్లడికి పాలుపొయ్యటానిక్కూడా మనకి కష్టంగా వుంది. నేను అన్నమాటలో తప్పేముంది? నిజంగా వీడు బతకటం ఎవరికి ఉద్ధరింపు ?"

"కన్నకొడుకుని చేతులారా చంపుకునే కసాయివాడి ననుకున్నావా? నాకుమాత్రం వాడిమీద ప్రేమ లేదా ?"

"ఏంలాభం? వాడి ప్రాణం నిలపటానికి చేతులు రాకపోయాక ఆపేక్ష వుంటే ఏంలాభం ?"

"ఇప్పుడేం చెయ్యమంటావు చెప్పు? నావల్ల తప్పేముంది?"

"మీకు తోచినట్లు చెయ్యండి. కడుపులో ఆపేక్షవుంటే వుపాయాలు వాటంతట అవేతోస్తయ్" అంటూ చరాలున లోపలికి వెళ్లిపోయింది కరుణ సంభాషణ తుంచివేసి.

ఎవరి నడిగినా బదులుదొరకలేదు. నెలాఖరుగనక అందరికీ డబ్బు కటకటగా వుంది. కొడుక్కి పాలడబ్బా తేవటానికి చేతులో కానీకూడా లేదు. పోనీ తండ్రికిరాస్తే? ఆయన పల్లెటూర్లో దస్తావేజులు అమ్ముకుంటూ అతికష్టం మీద కాలక్షేపం చేస్తున్నాడు. ఆయన తన కేం సాయం చేస్తాడు? ఏదైనా అడిగినా ఆయన కడుపుమాడ్చుకుని పంపవలసివస్తుంది. పైగా ఎంతో బాధపడతాడు. మరి ఈ చిక్కులోంచి బైటపడే దారి ఏముంది? ఆలోచనల్తో సుడితిరిగిపోతూ శాస్త్రి గుడ్డవుయ్యాలలో కళ్లు మూసుకుని సొమ్మసిల్లి పడివున్న కుర్రాణ్ని చూశాడు. గుడ్లని తోలుచుకుంటూ నీళ్లు చిందినయ్.

"బియ్యం తేవటం మరచిపోయారా ?" అని లోపలినుంచి అడిగింది కరుణ.

"మరచిపోలేదు. కాని—" అని ఆగిపోయి శాస్త్రి తల వంచుకున్నాడు. "అయితే జీతం వచ్చేదాకా పస్తులుపడుకోవలసిందేనా ?" అని వొణుకుతున్న కంఠంతో అడిగింది కరుణ. శాస్త్రి బదులు చెప్పకుండా తల వంచుకుని నిలబడ్డాడు.

కరుణ లోపల సలసల కాగిపోతోంది. ఇన్నాళ్లనుంచీ ఎన్నో బాధలు నిబ్బరంగా సహించింది. ఒక్కనాడైనా నోరెత్తి భర్తని పల్లెత్తుమాటయినా అనలేదు. కాని ఇవాళ తనకళ్లముందే కన్నకొడుకు నకనకలాడిపోతుంటే కరుణ చూస్తూ వూరుకోలేకపోయింది. లోపలినుంచి ఆవేశం, శోకం పొంగి వస్తున్నయ్. "ఇక నేనీ బాధలు పడలేను స్వామీ !" అని కంపిస్తున్న కంఠంతో, రగులుతున్న కడుపుమంటతో అరిచింది. ఈ మాటలు శాస్త్రికి చురుక్కున తాకినై. "కరుణా ! నాలాటి దురదృష్టవంతుడి భార్యవైనందుకు నీకీ బాధలు తప్పవు"అన్నాడు. విని కరుణ త్రుళ్లిపడింది. కరుకుగా "తప్పని బాధలకి నేను వెరిచేదాన్ని కాను. చేతులారా తెచ్చుకున్నవాటినే నేనింక సహించలేనని చెబుతున్నాను" అని శాస్త్రి ముఖంకేసి చూసింది. అతని ముఖాన కత్తి వేసినా

నెత్తురుచుక్క లేదు. "అయితే కరుణా! ఈబాధలన్నీ నేను చేతులారా కొని తెచ్చుకున్నవేనా? కన్నకొడుకుని ఎవరైనా చేతులారా చంపుకుంటారా? కట్టుకున్న భార్యని ఎవరైనా కావాలని ఉపవాసాలు పడుకోబెడతారా? నిజంగా దీనికంతకీ నేనే కారకుడినని నీవుద్దేశమా?" అని ఆవేశంతో అడిగాడు. ఇన్ని ప్రశ్నలకీ టూకీగా కరుణ ఒక్కటే జవాబు చెప్పాలని "ముందూ వెనకా చూసుకోవద్దా?" అంది. "అంటే నీ వుద్దేశం?" అని శాస్త్రి కోపంగా అన్నాడు. "ఏమీ లేదు. మమ్మల్నిద్దరినీకూడా పోషించవలసిన భారం మీమీద వుందని గుర్తుచేస్తున్నాను. అంతే" అంది కరుణ.

ఈదెబ్బ శాస్త్రికి నూటిగా ఘాటుగా తాకింది. దీనికి తట్టుకోటానికి ఎంతోసేపు పట్టింది. ఇప్పుడు కరుణవుద్దేశం కొంత తెలిసింది. ఇప్పటికి ఆమె తనను దోషిగా ఎందుకు పరిగణిస్తున్నదో అర్థమయింది. కాని ఈ కరుణేకదా ఆనాడు తనకి అంత చేయూతనిచ్చింది? ఈమేకదా తన గుడ్డితమ్ముణ్ణి బళ్లోచేర్పించమని అంత పట్టు పట్టింది. తలుచుకోగానే కళ్లు తిరిగినయ్.

"కరుణా! గుర్తు లేదా నీకు?" అని అడుగుతుంటే కరుణ మధ్యలోనే అడ్డంవచ్చి "మీరడగబోయే ప్రశ్న నాకు తెలుసు. నేను మరిదిభారమంతా వహిస్తానన్నాను. చదువూ,సంగీతం చెప్పించమన్నాను. నిజమే. కాని కన్నకొడుకుని మలమల మాడ్చి చంపుకోనా? నాచేత్తో నాకడుపుకే చిచ్చుపెట్టుకుంటానా? నేనేం దేవతనికాను. నేను మామూలుమనిషిని" అని తీవ్రంగా అంది.

శాస్త్రి నిర్ఘాంతపోయి మౌనంగా నిలబడిపోయాడు. కరుణ మళ్లీ అందుకుని "మనకి వచ్చేదాంట్లో సగం మరదికి పంపితే మనం ఏం తిని బదకాలి? నన్ను ఏంచేసినా సరేకాని ఈనెలనించీ అల్లా పంపితే నే నూరుకోను" అంది.

"ఏం చేస్తావేం?"

"ఏం చేస్తానా? వాడూ నేనూ కలిసి ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాం. అంతే. ఇంకేం చేస్తాం" అని కరుణ కఠోరంగా బదులుచెప్పింది.

ఇంతలో తలుపుకొట్టిన చప్పుడయింది. "వొదినా, తలుపు తియ్యవూ?" అని మధు కంఠం వినిపించింది. కరుణ గబగబా వెళ్లి తలుపు తీసింది. వొదినగారి, చెయ్యి పుచ్చుకుని కాళ్లతో తడువుకుంటూ మధు మెల్లిగా లోపలికి వచ్చాడు.

"ఎవరు తీసుకొచ్చార్రా మధూ? ఎంతసేపయిందీ?" అని శాస్త్రి ఆశ్చర్యంగా అడిగాడు.

"గోపాలం దింపి వెళ్లిపోయాడు. చాలాసేపయింది."

"అయితే తలుపు కొట్టలేదేం?" అంది కరుణ.

"చాలాసార్లు పిలిచాను. తలుపు కొట్టాను" అన్నాడు మధు. ఈ జవాబు విని కరుణ నిలువునా నీరయిపోయింది. ముఖం వివర్ణమైపోయింది. సిగ్గుతో ముగ్గిపోయి మధుకేసి చూడలేకపోయింది. ఇందాకటినించీ తనకీ, భర్తకీ మధ్య నడచిన మాటలన్నీ విన్నాడేమో? వింటే అతని మన స్సెంత నొచ్చుకుంటుందో? అసలే సుతిమెత్తని మనసు. ఎంత బాధపడతాడో? తను అన్నమాట్లలో తప్పేమీలేదు. కాని అవి విని మధు ఎంత తలకిందులైపోతున్నాడో? ఈ బాధే శాస్త్రినీ, కరుణనీ దహించివేస్తోంది.

మధు తడువుకుంటూ వుయ్యాలదగ్గరికి వెళ్లి నిద్రపోతున్న చంటివాడిని చేతుల్తో నిమిరాడు. వేళ్లకి చల్లగా తగిలి "వొదినా" అని కేకపెట్టాడు. కరుణ పరుగున వచ్చి ఉయ్యాల్లోంచి కుర్రాణ్ని తీసి "అయ్యో నా తండ్రీ!" అని ఒక్క శోకం పెట్టింది.

శాస్త్రి కాళ్లూ చేతులూ ఆడక శిలావిగ్రహంలాగా నిలుచున్నచోటే నిలబడిపోయాడు.

"బాబూ" అంటూ మధు కుప్పన కూలబడిపోయి ఏడవటం మొదలుపెట్టాడు.

కరుణ దీనంగా శోకాలుపెడుతుంటే పరిసరమంతా ప్రకంపించిపోయింది. కుర్రాడి వికృతమైన శవాన్ని ఒళ్లో పెట్టుకుని ఎంతోసేపు ఏడ్చింది. ఈ దారుణమైన శోకంతోపాటు మధుహృదయం

ఎంత గాయపడిందో అన్న బాధ కరుణని వేధిస్తూనే వుంది.

౬

"మధూ ! ఒక్కడివీ ఇక్కడ కూచున్నావేం? మాట్లాడవేం"అంటూ సుధ దగ్గరికి వచ్చి కూచుని అతని చేతులని తన చేతుల్లోకి తీసుకుంది.

"ఏం లేదు, సుధా ! నేను వెళ్లిపోతున్నాను"

"ఎక్కడికి ?'' అని ఆదుర్దాగా అడిగింది సుధ.

"ఎక్కడికైనా సరే. నాలాటివాళ్ల బతుకు అందరికీ బరువే''

"అందరికీనా ? కాదు పొరపాటు''

"పొరబాటు కాదు. నిజం. నన్నుగురించి మా అన్నయ్యా, వొదినా ఎన్నో కష్టాలు పడుతున్నారు. వాళ్లకి కొంచెంకూడా సాయం చెయ్యలేను. ఎందుకు నేను బతికి ! నన్ను పుట్టగానే మా అమ్మ చంపేస్తే ఎంతో బాగుండేది''

"ఛీ! అల్లాటి పాడుమాట లనబోకు''

"కాదు సుధా, నేను నిజం చెబుతున్నాను. ఇక రేపు నీకు కనిపించను''

"ఎక్కడికి వెళ్తావో చూస్తాను. అందరికీ చెప్తాను. వెళ్లకుండా కట్టిపారేయిస్తాను''

"నీకు పుణ్యముంటుంది సుధా. నన్ను వెళ్లిపోనీ. ఇది ఎవరికీ చెప్పబోకు. నేనింక మా అన్నయ్య ముఖమూ, వొదినముఖమూ చూడలేను. నన్ను వెళ్లిపోనీ. నేను వెళ్లిపోతే ఎవరికీ విచారంవుండదు''

"మధూ ! పొరబడుతున్నావ్. ఎవరికీ విచారం వుండదనుకుంటున్నావా ?'' అంటుంటే సుధ గుడ్డి కళ్లలోంచి రాలిన నీటిబొట్లు మధుచేతులమీద చిందినయ్. సుధముఖాన్ని చేతుల్తో నిమిరాడు. ఆమెజుట్టుని వేళ్లతో సవరించాడు. ఏదో తెలియని ఆనందంతో పొంగిపోయాడు.

"నేను కూడా వస్తా" అంది సుధ ఎంతో లాలనగా.

"ఎక్కడికి" అన్నాడు ఆశ్చర్యంతో మధు.

"నువ్వెక్కడికి వెళ్తే అక్కడికే"

"వొద్దు. నేను తిరిగిరానిచోటికి వెళ్లిపోతున్నాను."

"ఛీ! పాడుమాటలు అనద్దని చెప్పలా. పిరికిపండలాగా మాట్లాడతావేం ? మనిద్దరం కలిసి పారిపోదాం. నువ్వు పాడు. నేను ఫిడేలు వాయిస్తాను. దేశదేశాలూ పాటలు పాడుకుంటూ తిరుగుదాం. మనమీద లోకానికి దయకలగదా ? మనపొట్టలు నిండకపోతయ్యా ?" అంది సుధ. ఈ మాటలు వినేసరికి మధుప్రాణంలేచి వొచ్చింది. అతని గుడ్డిహృదయంలో ఎన్నెన్నో ఆశలు గంతులు వేసినయ్. పట్టలేని సంబరంతో సుధ చేతిని గట్టిగా నొక్కుతూ "అయితే రేపే"అన్నాడు. "ఓ అల్లాగే." అంది సుధ.

౭

"ఏమండీ, మధుజాడ ఏమయినా తెలిసిందా ? పాపం ఏమైపోయాడో కదా" అంది కన్నీళ్లతో కరుణ. మరిది పారిపోయినదగ్గరనుంచీ కరుణకి అహర్నిశలూ అతనిస్మరణే. నెలలు నిండిన మనిషి. ఈబరువు కొంతా. మంచానికి అంటుకొనిపోయింది.

వెతికి వేసారిపోయి ఇంటికి తిరిగివచ్చిన శాస్త్రి "ఎక్కడా జాడ తెలియదు. ఎంత వెదికినా లాభం లేకపోయింది. మానాన్నముఖం ఎల్లా చూస్తానిక ?" అన్నాడు.

"పాపం ! భారమంతా మనమీద పెట్టారు. దిక్కుమాలినదాన్ని ఎన్నిమాటలన్నానో. ఎంత నొచ్చుకున్నాడో. నన్ను ఏం చేసినా పాపం లేదు. మీకు తోచిన శిక్ష వెయ్యండి. అప్పటికిగాని నాకు మనశ్శాంతి లేదు"

"నీ తప్పేముంది కరుణా ? ఎందుకు నువ్వింత విచారపడతావు ?"

"మరెవరిది తప్పు? పాపం! మధు ఎక్కడున్నాడో?"

"ఎక్కడున్నప్పటికీ వాడి కేం ఫరవాలేదు. వాణ్ణి భగవంతుడే కాపాడతాడు కరుణా!"


"అంతకంటే కావాల్సిం దేముంది? మధు ఎక్కడున్నా సుఖంగా వుండాలనే నా ఆరాటం" అంటూ కరుణ "అబ్బా!" అని మూల్గింది. శాస్త్రి పరుగున వెళ్లి మంత్రసానిని తీసుకొచ్చాడు.

చాలా కష్టపుకానుపు. రాత్రంతా కరుణ యమయాతనపడింది. తెలతెలవారుతుంటే పురుడు వచ్చింది. బొడ్డు కోసి పిల్లడికి స్నానం చేయిస్తూ మంత్రసాని "అబ్బాయికి గుడ్లు రెండూ లేవు తల్లీ!" అని ఒక్క కేక వేసింది. బాధతో సొమ్మసిల్లి వున్న కరుణ ఈమాట వినగానే మూర్ఛపోయింది. పురిటిగదిబైటి నుంచి శాస్త్రి "ఏమిటే? పిల్లడికి కళ్లు లేవా? తల్లి ప్రాణాని కేం ఫరవాలేదుకదా?" అని కేక పెట్టాడు. లేదని మంత్రసాని హామీయిచ్చింది.

ఎంతో సేపటికి కరుణకి స్పృహ వచ్చింది. "భగవంతుడా! ఎటువంటి ప్రాయశ్చిత్తం చేశావు తండ్రీ" అని శోకాలు పెట్టింది. పురిటిగదిగడపలో నిలబడి శాస్త్రి కళ్లులేని పసిగుడ్డుకేసీ, తల్లడిల్లుతున్న తల్లికేసీ నిర్జీవప్రతిమలాగా చూస్తూ నిలబడిపోయాడు. ఎంతో సేపటికి తెప్పరిల్లుకుని "విచారపడకు కరుణా, ఇది ప్రాయశ్చిత్తం అనుకోటం దేనికి? ఇది భగవంతుడి ప్రసాదం అనుకుని స్వీకరిద్దాం. ఎందుకు చెప్పు, ఏడ్చి ఏం లాభం? మనచేతులో ఏముంది?" అంటూ ఆపుకోలేక గుడ్డ నోటికి అడ్డం పెట్టుకున్నాడు.

"ఏడ్చి లాభంలేదు. కాని ఏడవకపోతే నాగుండె బద్దలైపోతుంది" అంటూ కరుణ వెక్కివెక్కి ఏడ్చింది.

భార్యాభర్తలిద్దరూ అప్రయత్నంగా మధుని తలుచుకుని కుమిలిపోయారు. ఏదో అదృశ్యశక్తి చేతుల్లో చిక్కుకున్న కీలుబొమ్మల్లాగా ఇద్దరూ గిలగిల తన్నుకున్నారు.



రామదాసు బంధింపబడిన గోల్కొండకోట